# ఇండియన్ పాలిటీ

## భారతదేశంలో స్థానిక పరిపాలన – పంచాయతీరాజ్ సంస్థలు

### గ్రామసభ

★ భారత రాజ్యాంగ సవరణ చట్టంలో 243(ఎ) అధికరణ గ్రామసభ గురించి ప్రస్తావించింది. గ్రామంలోని రిజిస్టర్డ్ ఓటర్లు సభ్యులుగా ఉంటారు. గ్రామసభ సమావేశాలకు సర్పంచ్ అధ్యక్షత వహిస్తాడు.

★ సమావేశ తేదీలు, ఎజెండాలను పంచాయతీ కార్యనిర్వహణాధికారి సర్పంచ్‌ను సంప్రదించి నిర్ణయిస్తాడు. ఏప్రిల్ 14, అక్టోబరు 2 తేదీల్లో ఈ సమావేశాలు నిర్వహిస్తారు. ఏప్రిల్ 14 అంబేడ్కర్ జయంతిని గ్రామసభా దినంగా పాటిస్తారు.

★ గ్రామాభివృద్ధి పథకాల లబ్ధిదారులను గుర్తించడం, పంచాయతీ వార్షిక ఖాతాలు, స్టేట్‌మెంట్ల పరిశీలన, పంచాయతీ గత సంవత్సర ఆర్థికపాలన నివేదికల పరిశీలన, సంక్షేమ పథకాల అమలుకు స్వచ్ఛంద శ్రామికుల సమీకరణ, నగదు/ వస్తు రూపంలో విరాళాల సమీకరణ లాంటివి గ్రామసభ విధులు.

★ గ్రామసభలను సక్రమంగా నిర్వహించని సర్పంచ్‌ను కలెక్టర్ అధికారం నుంచి తొలగించవచ్చు.

### గ్రామపంచాయతీ

★ పంచాయతీరాజ్ వ్యవస్థలో దిగువ అంచె గ్రామ పంచాయతీ. ఒక రెవెన్యూ గ్రామం లేదా కొన్ని గ్రామాలను కలిపి గ్రామపంచాయతీగా ఏర్పాటు చేస్తారు.

★ జనాభానుబట్టి గ్రామాన్ని కొన్ని వార్డులుగా విభజించి, ఒక్కో వార్డు నుంచి ఒక్కో పంచాయతీ సభ్యుడిని ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. జనాభానుబట్టి అయిదుగురికి తగ్గకుండా 21 మందికి మించకుండా సభ్యులుంటారు. ప్రస్తుతం, సర్పంచ్‌ని కూడా ప్రజలే ప్రత్యక్షంగా ఎన్నుకుంటారు. వీరికి పోటీచేయడానికి 21 ఏళ్ల కనీస వయసు ఉండాలి. ఓటరుకు 18 ఏళ్లు ఉండాలి.

★ సర్పంచ్ గ్రామ పంచాయతీ రాజకీయ అధిపతి, పదవీరీత్యా ఛైర్మన్. ఇతను పంచాయతీ సమావేశాలకు అధ్యక్షత వహిస్తాడు. తీర్మానాలపై ఓటువేసే అధికారం కూడా ఉంటుంది.

★ ఆంధ్రప్రదేశ్ పంచాయతీరాజ్ చట్టం 1994, రెండో భాగంలో పంచాయతీ నిర్మాణ, నిర్వహణ అధికారాలు, విధులు లాంటివి ఉన్నాయి. ఆదాయాన్నిబట్టి రూ. 60,000 కు ఎక్కువ ఉంటే నోటిఫైడ్ పంచాయతీ, తక్కువైతే నాన్-నోటిఫైడ్ అని విభజించారు. 1995 నాటికి 1460 నోటిఫైడ్, 20483 నాన్-నోటిఫైడ్ పంచాయతీలు ఏర్పడ్డాయి.

### సర్పంచ్ అధికారాలు

★ ఉపసర్పంచ్ ఎన్నికకు ఏర్పాటు చేయడం, పంచాయతీ రికార్డులను తనిఖీ చేయడం, పంచాయతీ తీర్మానాల అమలు విషయంలో కార్యనిర్వహణ అధికారిపై నియంత్రణ.

★ పంచాయతీ ఆమోదించిన తీర్మానాల ప్రకారం చర్యలు తీసుకోవడం.

★ గ్రామపంచాయతీ, గ్రామసభ సమావేశాలను నిర్వహించడం సర్పంచ్ విధులు.

### పంచాయతీ కార్యనిర్వహణాధికారి

★ ఇతన్ని రాష్ట్ర పంచాయతీరాజ్ కమిషనర్ నియమిస్తారు. పంచాయతీ ఆస్తులు, భవనాలు, సిబ్బందిపై వీరికి పూర్తి అజమాయిషీ ఉంటుంది.

★ సర్పంచ్ అనుమతి/ ఆదేశంతో గ్రామసభ, పంచాయతీ సమావేశాలను ఏర్పాటు చేస్తాడు. సమావేశాలను ఏర్పాటు చేయడానికి సర్పంచ్ సుముఖత చూపకపోయినా కార్యనిర్వహణ అధికారి గడువులోగా వాటిని నిర్వహించాలి. ఇతను సమావేశాల్లో పాల్గొనవచ్చు కానీ తీర్మానాలను ప్రతిపాదించే, ఓటింగ్‌లో పాల్గొనే హక్కు ఉండదు.

★ పంచాయతీ తీర్మానాల అమలు, సమాచారాన్ని ఉన్నతాధికారులకు అందించడం; తీర్మానాలు, ఇతర రికార్డులను భద్రపరచడం లాంటివి ఇతడి ముఖ్య విధులు.

## గ్రామపంచాయతీ అధికారాలు – విధులు

★ 1994 చట్టం రెండో అధ్యాయంలో గ్రామపంచాయతీ అధికారాలను పేర్కొన్నారు.

1. **కరణీయ విధులు:**

★ పంచాయతీ భవనాలు, రహదారుల నిర్మాణం, మరమ్మతులు. గ్రామంలో విద్యుత్ దీపాలను అమర్చడం, నిర్వహించడం.

★ మురుగునీటి కాలువల నిర్మాణం, నిర్వహణ. రహదారులను శుభ్రంగా ఉంచడం.

★ ప్రజా మరుగుదొడ్ల నిర్మాణం, శ్మశాన వాటికల నిర్మాణం, నిర్వహణ.

★ అంటువ్యాధులు ప్రబలకుండా చర్యలను చేపట్టడం

★ తాగునీటి సౌకర్యం పెంపొందించడం, చెరువుల మరమ్మతు.

★ జనన, మరణాల నమోదు; పశువుల క్షేత్రాల నిర్మాణం.

2. **విచక్షణాధికారాలు:**

★ ప్రయాణీకులకు విశ్రాంతి మందిరాల నిర్మాణం, నిర్వహణ. బహిరంగ ప్రదేశాలు, రహదారుల పక్కన మొక్కలను నాటడం.

★ పార్కుల నిర్మాణం, నిర్వహణ. గ్రంథాలయాలు, పఠన మందిరాల స్థాపన, నిర్వహణ.

★ ఆధునిక వ్యవసాయ పద్ధతులను ప్రచారం చేయడం. బహిరంగ మార్కెట్ల నిర్మాణం, నిర్వహణ

★ ఉపద్రవాలు సంభవించినప్పుడు ఉపశమన చర్యలను చేపట్టడం.

★ ప్రసూతి, శిశుసంక్షేమ కేంద్రాల ఏర్పాటు, నిర్వహణ.

★ సమాజాభివృద్ధి పనుల్లో స్వచ్ఛంద శ్రమదాన శిబిరాలను నిర్వహించడం.

★ భూసంస్కరణ కార్యక్రమాల అమలు; ఆటస్థలాలు, క్లబ్బుల్లాంటి వినోద కేంద్రాలను ఏర్పాటు చేయడం, నిర్వహించడం.

★ కుటీర పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సహించడం.

**ఆదాయ మార్గాలు:** ఇంటిపన్ను, ఉత్పత్తి అయిన వాటిపై పన్ను, ఆస్తి బదలాయింపు పన్ను, వాహనాలు, వ్యవసాయ భూములపై పన్ను, సీనరేజ్ భూమిపై సర్‌ఛార్జ్.

## మండల పరిషత్

★ రాజకీయ వికేంద్రీకరణను శీఘ్రంగా సాధించడానికి అశోక్ మెహతా కమిటీ సూచనల మేరకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం వీటిని ఏర్పాటు చేసింది. వీటి ఏర్పాటులో ఊహించిన విధంగానే రాజకీయ చైతన్యం వెల్లివిరిసింది. 1994లో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం చిన్న చిన్న మార్పులతో నూతన చట్టాన్ని రూపొందించి, అమలు చేసింది.

★ రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక నోటిఫికేషన్ ద్వారా మండల పరిషత్ (ప్రస్తుత మండల ప్రజాపరిషత్) ఏర్పాటును ప్రకటిస్తుంది. మండల ప్రాదేశిక పరిధులు, విధులు, స్వభావాన్ని రాష్ట్ర ప్రభుత్వమే నిర్ణయిస్తుంది. ఈ కొత్తచట్టం ప్రకారం ప్రత్యేక పరిస్థితుల్లో రద్దుచేసే అధికారం కూడా రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది.

## మండల ప్రజాపరిషత్

★ మండల స్థాయిలో పాలనా తీర్మానాలను ఆమోదించే సంస్థ. మండల పరిషత్, మండలంలోని ప్రజల అభివృద్ధి, శ్రేయస్సును పెంపొందించే లక్ష్యంతో వివిధ కార్యక్రమాలను రూపొందించి, అమలు చేస్తుంది.

★ మండలాన్ని కొన్ని ప్రాదేశిక నియోజకవర్గాలుగా విభజించి, ఒక్కో నియోజకవర్గం నుంచి, ఒక్కో మండల ప్రాదేశిక సభ్యుడిని (MPTC) ప్రజలే ప్రత్యక్షంగా ఓటువేసి ఎన్నుకుంటారు. చట్టంలో నిర్ణయించిన ప్రకారం రిజర్వేషన్ల ద్వారా ఆయా వర్గాల వారికి స్థానాలను కేటాయిస్తారు. రిజర్వు చేసిన స్థానం నుంచి ఆ వర్గం వారే పోటీ చేయాలి.

★ మండల ప్రాదేశిక నియోజకవర్గాల నుంచి ఎన్నికైన సభ్యులతోపాటు మండల పరిషత్ సమావేశాల్లో శాశ్వత ఆహ్వానితులుగా కొందరు పాల్గొనవచ్చు. వారు..

1) మండలంలోని విధానసభ సభ్యులు

2) లోక్‌సభ, రాజ్యసభ సభ్యులు

3) జిల్లా కలెక్టర్

4) మండల పరిషత్ పరిధిలోని గ్రామ పంచాయతీ సర్పంచులు, మండలం నుంచి జిల్లా పరిషత్‌కు ఎన్నికైన సభ్యుడు, ZPTC మెంబరు, జిల్లా పరిషత్ ఛైర్మన్, వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడు.

★ వీరు మండల సమావేశాల్లో పాల్గొని, తీర్మానాలపై తమ అభిప్రాయాలను చెప్పవచ్చు. కానీ వీరికి ఓటింగ్‌లో పాల్గొనే అధికారం ఉండదు. తీర్మానాలను ఆమోదించే అధికారం ఎంపీటీసీలకు మాత్రమే ఉంటుంది.

## మండల ప్రజాపరిషత్ అధ్యక్షుడు

★ ప్రతి మండలానికి, ఒక అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు ఉంటారు. మండల ప్రాదేశిక నియోజక వర్గాలకు జరిగిన ఎన్నికల అనంతరం మొదటి సమావేశంలోనే ప్రాదేశిక నియోజక వర్గాల నుంచి ఎన్నికైన సభ్యుల్లో ఒకరిని అధ్యక్షుడిగా ఎన్నుకుంటారు.

★ మండలాధ్యక్షుడిని పార్టీ ప్రాతిపదికన బహిరంగంగా సభ్యులు చేతులు ఎత్తడం ద్వారా తమ నిర్ణయాన్ని తెలుపుతూ ఎన్నుకుంటారు. ఈ ఎన్నికకు గుర్తింపు పొందిన పార్టీలు 'విప్' జారీ చేస్తారు.

★ సభ్యుల్లో ఒకరిని ఉపాధ్యక్షుడిగా ఎన్నుకుంటారు. మండలాధ్యక్షుడి పదవులకు కూడా రిజర్వేషన్‌లను పాటిస్తారు. ఇతని పదవీకాలం అయిదు సంవత్సరాలు.

★ మండల పరిషత్ సమావేశాల తేదీలను నిర్ణయించడం, ఎజెండా తయారుచేయడం, తీర్మానాలను అమలు చేయడం లాంటివి చేస్తారు.

★ మండలాభివృద్ధి అధికారితో సంప్రదించి సమావేశాలను నిర్ణయించడం, వాటికి అధ్యక్షత వహించడం, రికార్డులను పరిశీలించడం, అత్యవసర పరిస్థితుల్లో సహకారాన్ని అందించడం లాంటివి మండలాధ్యక్షుడి ముఖ్య విధులు.

## మండల మహాసభ

★ ప్రతి మండలానికి ఒక మండల మహాసభ ఉంటుంది. మండల ప్రాదేశిక పరిధిలో ఉన్న గ్రామ సర్పంచ్‌లు, మండల పరిషత్ సభ్యులు ఈ మహాసభలో సభ్యులుగా ఉంటారు. మూడు నెలలకోసారి ఈ సభ సమావేశమవుతుంది.

★ మండల అధ్యక్షుడిని సంప్రదించి, మండల పరిషత్ అభివృద్ధి అధికారి దీన్ని ఏర్పాటు చేస్తాడు. మండల పరిషత్ అధ్యక్షుడు ఈ సమావేశాలకు అధ్యక్షత వహిస్తాడు.

★ గ్రామ పంచాయతీలకు, మండల ప్రజాపరిషత్‌కు సంధానకర్తగా ఈ మహాసభ ఉంటుంది. మండల వార్షిక బడ్జెట్ ఆడిట్ నివేదిక, గడిచిన సంవత్సర వార్షిక పాలనా నివేదిక, వార్షిక బడ్జెట్‌లో పేర్కొన్న నూతన పథకాలు లాంటి వాటిని ఈ సభ చర్చిస్తుంది.

## మండల పరిషత్ అభివృద్ధి అధికారి

★ మండలంలో ముఖ్య కార్యనిర్వహణాధికారి (MPDO). ఇతడిని రాష్ట్ర ప్రభుత్వం నియమిస్తుంది. విధి నిర్వహణలో మండల పరిషత్, రాష్ట్ర ప్రభుత్వానికీ బాధ్యత వహిస్తాడు.

★ మండల పరిషత్ సిబ్బంది పనితీరు, నియంత్రణ పరిషత్ సమావేశాల్లో పాల్గొని సభ్యుల ప్రశ్నలకు సమాధానాలు చెప్పడం, మండల పరిషత్ ఆస్తులు, భవనాలపై నియంత్రణ, అభివృద్ధి కార్యక్రమాల అమలు తీరు పరిశీలన, పరిషత్ తీర్మానాల అమలుకు చర్చలు చేపట్టడం, మండల బడ్జెట్‌ను రూపొందించడం, దాన్ని పరిషత్ సమావేశంలో ప్రవేశపెట్టడం ఎంపీడీఓ ముఖ్య విధులు. మండలాభివృద్ధి అధికారికి సహాయకారులుగా వివిధ శాఖల అధిపతులను రాష్ట్రప్రభుత్వం నియమిస్తుంది.

## మండల పరిషత్ అధికారాలు – విధులు

మండల పరిషత్ పరిధిలో ఉన్న ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరచడానికి పరిషత్ సహాయకారిగా ఈ కింది విధులను నిర్వర్తిస్తారు.

1. **సమాజాభివృద్ధి:** సమాజానికి ఉపయోగపడే కార్యక్రమాలను గ్రామ పంచాయితీలు, సహకార సంఘాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో అమలు చేస్తుంది.

2. **వ్యవసాయాభివృద్ధికి అవసరమైనవి:** మండల పరిషత్ ప్రధానంగా గ్రామాల అభ్యుదయం కోసం ఏర్పడుతుంది. గ్రామీణ ప్రజల ప్రధాన వృత్తి అయిన వ్యవసాయ రంగ అభివృద్ధికి మండల పరిషత్ ఇతోధికంగా సహాయపడుతుంది. వ్యవసాయ రంగంలో అధికోత్పత్తిని సాధించడానికి అవసరమైన కింది చర్యలను చేపడుతుంది.

   ఎ) నాణ్యమైన, మేలైన విత్తనాల పంపిణీ

   బి) ఎరువులు, క్రిమిసంహారక మందుల సరఫరా

   సి) అధునాతన పద్ధతులను ప్రచారం చేయడం

   డి) గ్రామీణ అడవుల పెంపకం

   ఇ) గొట్టపు బావుల తవ్వకం

   ఎఫ్) వ్యవసాయ అవసరాలకు విద్యుచ్ఛక్తి వినియోగం

   జి) వ్యవసాయ రుణాన్ని అందించడం

   హెచ్) భూసార పరిరక్షణ

   ఐ) కంపోస్టు ఎరువుల తయారీ

3. **పశుపోషణ, చేపల పెంపకం:** సంకరజాతి పశువుల అభివృద్ధి వీర్య సేకరణ కేంద్రాలను ఏర్పరచడం, పశువుల్లో అంటువ్యాధులను నిర్మూలించడం, మేలైన పశుగ్రాస ఉత్పత్తికి తోడ్పడటం, పశువుల పెంపకానికి సంబంధించిన ఆధునిక పద్ధతుల ప్రచారం.

4. **ఆరోగ్యం, గ్రామీణ పారిశుద్ధ్యం:** ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఏర్పాటు, రక్షిత తాగునీటి సదుపాయాల కల్పన, అంటువ్యాధుల నిర్మూలన, పొగచూరని వంటపొయ్యిల వాడకాన్ని ప్రోత్సహించడం, టీకాల గురించి ప్రచారం చేయడం.

5. విద్య

6. సామాజిక విద్య

7. కమ్యూనికేషన్లు

8. సహకారం

9. కుటీర పరిశ్రమలు

10. మహిళా సంక్షేమం

11. సాంఘిక సంక్షేమం

12. అత్యవసర ఉపశమనం

13. గణాంక సమాచార సేకరణ

14. స్వయం సహాయ పథకాలు

15. ట్రస్ట్‌ల నిర్వహణ.

## మండల పరిషత్ ఆదాయ మార్గాలు

★ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాల అమలుకు అందించే నిధులు.

★ సమాజాభివృద్ధి కార్యక్రమాల అమలుకు విడుదలైన నిధులు.

- ★ గ్రామ పంచాయతీల లెవీ ద్వారా వచ్చే వసూళ్లు.
- ★ భూమి శిస్తు, రాష్ట్ర ప్రభుత్వ పన్నులు, ఫీజుల్లో వచ్చే వాటా.
- ★ రాష్ట్ర ప్రభుత్వం జిల్లా పరిషత్‌కు కేటాయించిన నిధుల్లో కొంత భాగం.
- ★ ప్రజలు, సంస్థలు ప్రకటించే విరాళాలు.
- ★ అఖిల భారత సంస్థలు విడుదల చేసే సహాయక గ్రాంట్లు.
- ★ లాభదాయక సంస్థల నిర్వహణ ద్వారా పొందే ఇతర ఆదాయం.

**243(ఎ) – 244(ఒ) ఆర్టికల్ల వివరాలు**

- ★ 243(ఎ) గ్రామసభ
- ★ 243(బి) స్వభావం, మూడంచెల పంచాయతీరాజ్ వ్యవస్థ
- ★ 243(సి) మండల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఎన్నిక
- ★ 243 (డి) పదవులకు రిజర్వేషన్లు
- ★ 243(ఇ) సభ్యుల పదవీకాలం
- ★ 243(ఎఫ్) సభ్యులు పోటీచేయడానికి అర్హతలు
- ★ 29 పాలనాంశాలు
- ★ 243(హెచ్) ఆదాయ మార్గాలు
- ★ 243(ఐ) ఆర్థిక సంఘం ఏర్పాటు (మొదటి ఆర్థిక సంఘం ఛైర్మన్ ఎస్. లక్ష్మణస్వామి)
- ★ 243(జె) అకౌంటింగ్ – ఆడిటింగ్
- ★ 243(కె) ఎన్నికల సంఘం ఏర్పాటు
- ★ 243(ఎల్) కేంద్రపాలిత ప్రాంతాలకు ఈ చట్టం వర్తించదు.
- ★ 243(ఎం) షెడ్యూల్డ్, అటవీ ప్రాంతాల్లో 73వ సవరణ చట్టం వర్తించదు. వర్తించని రాష్ట్రాలు జమ్మూ – కశ్మీర్, నాగాలాండ్, మిజోరం, మేఘాలయా, మణిపుర్
- ★ 243(ఎన్) పాత శాసనాల కొనసాగింపు
- ★ 243(ఒ) పంచాయతీ ఎన్నిక వివాదాలు, పరిష్కారాలు.

**రచయిత: ఎం. నారాయణ మూర్తి**